ఉగాది ప్రత్యేకమ్

# కామరాజు కాలేజీ కథ

– ఆకెళ్ళ

అబ్బే! ఆ అమ్మాయిని చూస్తే... నువ్వామాటనవు బాస్! అయిదడుగుల ఆరంగుళాలున్న ఆడపిల్లకి భానుప్రియ కళ్ళు, శ్రీదేవి ముక్కు, జయప్రద గడ్డం ఉందనుకో... అమలలా నవ్వి... రాధికలా కొంటెగా కలవరించిందనుకో... ఎంతటి తలవంచని వీరుడైనా... తలమీద క్రాపు సవరించుకుంటూ ఆమె వెనక పడాల్సిందేగా...

ఈ కాలేజీలో... నేనడుగుపెట్టి - ఎన్నాళ్లయిందో నాకే గుర్తులేదు. నేను కానీ పరీక్ష ప్యాసయితే... మా బాబు పెళ్ళిచేసి... వ్యాపారంలోకి తోసేస్తాడని మనం ఇక్కడే కాలక్షేపం చేస్తున్నాం... ఎందరో అమ్మాయిలని చూసి మనం మనసు పారేసుకున్నాం... అయినా... ఇంకా నేనా సుందరిని మర్చిపోలేదు.

అనలామెను చూడగానే నే ప్రేమలో పడిపోయాను. లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ బాస్! కొన్ని నమ్మాలి అంతే. ఇంతకీ... ఆ అమ్మడు పేరేంటో తెల్సునా... 'పేపర్ పాట్' ఇదేం పేరని ఆశ్చర్యపోతున్నావా? దాని వెనకో కథ ఉంది... ఆ పిల్ల కాలేజీలో చేరిన కొత్తలో ఎవడో కొంటె కుర్రాడు... పేపర్ని... ఏరోలా చేసి - ఆ బాణం ఆమె మీదకి వేశాడు. ఆ బాణం... తలమీద తగిలింది. "అబ్బా! ఏమిటే... ఈ పేపర్ పాట్" అందా అమ్మడు. ఆ క్షణంలో వంద కోకిలలు కూశాయి. అప్పటినుంచి అమ్మడి పేరు పేపర్‌పాట్‌గా మారిపోయింది.

ఆ పేపర్ పాట్‌ని చూసిన వెంటనే లవ్‌లో పడి పోయేనని నన్ను తక్కువగా అంచనా వెయ్యకు. అప్పుడు మనం కాలేజీలో చేరిన కొత్త. రాజా ఆఫ్ వల్లీపూర్‌లాగానో ప్రిన్స్ ఆఫ్ వేల్సు... పిన్ని కొడుకులాగానో ఉండేవాళ్లం. మనగురించి... మనం... మరీ గొప్ప చెప్పుకోకూడదుగాని ఆడపిల్లలు... మన్నోసారి క్రీగంట చూసి మరీ కళ్ళు తిప్పుకునేవారు. ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు... మన్నించి లొలెటర్స్ అందుకోవాలనే ఆశతో... నోట్సులు కూడా అడగటం ఆరంభించేరు. అది చూసిన మన ఫ్రెండ్సో... మన్ని "కామరాజూ! నువ్వు పెట్టిపుట్టేవురా.సార్ధకనామధేయుడివిరా..." అని మెచ్చుకునేవారు.

అలాంటి మనం పేపర్‌పాట్‌తో ప్రేమలో పడిపోయాం... ఆ సౌందర్యం... వర్ణించటానికి వెయ్యి ఆదిశేషులు చాలరు. అంతటి సౌందర్యం వెనక - మగాడ్ని లక్ష్యపెట్టని మొండితనం కూడా ఉంది. కొమ్ములు తిరిగిన రౌడీలు అయినా... ఆమె ఎదురుపడితే ఏదో పనున్నట్టు... రోడ్డుమీంచి గబగబా తప్పుకోవాల్సిందే. ఆమె... యన్... సి...సిలో అండర్ ఆఫీసర్... ఆ డ్రస్ వేసుకుని ఆమె పేరేడ్ చేస్తుంటే... పీరియడ్స్... పీరియడ్స్ ఎగ్గొట్టి ఆమె డ్రిల్లు చూస్తూ కూర్చునే వారు స్టూడెంట్సు.

ఆమె వేసే ప్రతి అడుగు... నాకు గుండెల్లో రైళ్లు పరుగెత్తించేవి. మూర్తీభవించిన సౌందర్యం... నా సొంతం కావాలని ప్రతిరాత్రి కలలు కనేవాడ్ని.

కాన్డబ్బు ఖర్చు లేకుండా కనచ్చుగా కలల్ని అంచేత టెక్నికలర్‌లో కలలు కనేసేవాడ్ని. అడపా దడపా క్లాసులో ఆమెగారికి ఫోజులు కట్ చేసేవాడ్ని. అయితే ఆమెగారు... తన దువ్వెనలో చిక్కుకున్న చిక్కుని చూసినట్టు చిరాగ్గా చూసేది తప్ప చిరునవ్వు అయినా నవ్వేదికాదు.

అసలు లవ్‌లో మనం మునిగిపోవటమేకాని ముందడుగు వెయ్యలేక పోవటానికి ఒక కారణం ఉంది. అదేమిటంటే ఫైనలియర్ కుర్రాడొకడు తిథి వారం వర్జ్యం అన్నీ చూసుకొని... ఓ శుభముహూర్తాన ఆమెగారికి ఓ ప్రేమలేఖ అందించాడు. ఆమె... సరేనంటే శుభలేఖ వేయించేస్తానని చాలా నమ్మకంగా రాశాడు.

ఆమె మారుమాట్లాడకుండా ప్రేమలేఖ అందుకుంది. ఆరోజు ఆ ఫైనలియర్ కుర్రాడి ఆనందం చూసి తీరాల్సిందే. వందమందిని 'ప్రేమించిచూడు' సినిమాకు లాక్కుపోయాడు. పదిమందిని హోటల్లో భోజనానికి తీసుకుపోయాడు. ముగ్గుర్ని మందు పార్టీకి ఈడ్చుకుపోయాడు.



ఆ మర్నాడు సాయంత్రం... ఒక్కడూ గోకుల్ బార్ మూలటేబిల్ దగ్గర కూర్చుని 'మనను గతిఇంతే... మనిషి బ్రతుకింతే' అంటూ పాడుకుంటూ ఉండిపోయాడు. ఆ తర్వాత చాలా సాయంత్రాలు అతనా పాట పాడుకున్నాడు కాని పావల వెంట మాత్రం పడలేదు.

ఇంతకీ... ఆ ప్రేఘదాను... అలా దేవదాసు అయిపోవటానికి కారణం ఏమిటో తెలుసా? ఉత్తరం అందుకున్న... ఆ నెరజాణ ఆ ఉత్తరం ప్రిన్సిపాల్‌కి ఇవ్వలేదు. తల్లిదండ్రులకిచ్చి ప్రేమదాసుని కవ్వించ లేదు. దగ్గరకు పిల్చి దవడమీద కొట్టి డెంటిస్ట్ అడ్రస్ ఇవ్వలేదు... ఆ ప్రేమలేఖలో ఉన్న తప్పులు రెడ్ ఇంకుతో అండర్‌లైన్ చేసి... పదికి రెండు మార్కులు... అంటూ మార్కులు కూడా ఎర్రఇంకుతో వేసి "కొంచెం ఇది ప్రేమదాసుగారికి ఇచ్చేస్తారా?" అని అతనితో చదివే కుర్రాళ్లకిచ్చింది. ఆ ఉత్తరం... కాలేజీ అంతా తిరిగికాని ప్రేమదాసుకి చేరలేదు.

"నువ్వు ప్రేమలో" 'రెండు మార్కులుగాడివని' పాట్ బద్దలు కొట్టి మరీ చెప్పిందా పడతి... దాంతో ప్రేమదాసుగాడి సొంతపేరు అంతా మర్చిపోయారు... ఇప్పుడు వాడ్ని జనం రెండు మార్కులుగాడని పిలుస్తున్నారు.

నే చెప్పేది శాంపిల్ కేసు... ఇలా ఆమెకొచ్చిన ప్రేమలేఖల గురించి చెప్పాలంటే అది రామాయణమంత ప్రేమాయణం అవుతుంది. నెల తిరగ్గానే... మనం దినపత్రికలు.. పాతపేపర్ కొనేవాడికి అమ్మి నట్టుగానే.. ఆమె తనకొచ్చిన ప్రేమలేఖల్లో తనపేరు కత్తిరించేసి కాలేజీ ఎదురుగా ఉన్న బజ్జీలకొట్టుకి అమ్మేసేది.

ఆ డబ్బులు కాలేజీముందు ఉన్న ముష్టి వాళ్లకి పంచేసేది. ఇక... బజ్జీలు కొన్న ప్రతివాడికి.. ఒక ప్రేమ .కావ్యం చేరి అదీ వేడి వేడి... ప్రేమ కావ్యాలు ఎవడిపేరు... ఏ ప్రేమ కావ్య రచయితగా.. ఏ రోజు బయట పడుతుందో ఎవరికీ తెలీదు.

ఆ రకంగా ప్రేమలేఖల బెడద నించి ఆ అమ్మాణి సులువుగా బయట పడింది. సున్నితంగా చెప్తే.. వినని సన్నాసిగాళ్లు ఒకసారి ఆమెను.. ఒంటిగా చుట్టుముట్టేరు. 'ఏమిటే... నీ పొగరు' అంటూ.. ఒకడు జుట్టు అంది పుచ్చుకోబోయాడు. అంతే- గాలిలో ఆమె చెయ్యి ఎప్పుడు లేచిందో అవతలి వాడికి తెలియలేదు.. మళ్లా పళ్ల డాక్టరు దగ్గర్నుంచి ఇంటికెళ్లాకా కానీ ఏమయిందో వాడికి తెలియలేదు.

అది ఎన్.సి.సి.లో డ్రిల్ చేసే శరీరం. కాలేజీ డాన్సు పోటీల్లో బహుమతి పొందే హస్తలాఘవం, ఉదయం యోగాసనాలు వేసే ధారుఢ్యం తిరుగు లేదు ఆ పిల్లకి. చిరునవ్వు చిందిస్తునే..

ఆ చిన్నది.. చెక్కు వెసెయ్యగలదు. అలాంటి కాలేజి కరేడాతో మనం.. ప్రేమలో పడ్డాం. రాత్రికి పగలుకి తేడాలేకుండా.. నిండా ప్రేమలో పడిపోయాం.

ప్రేమ గుడ్డిదేకాదు.. చెవిటిది కూడా అందుకే ఎందరు ఎన్ని చెప్పినా.. మనం విన్లేదు. గజినీలు, ఘోరీలు.. ఇందరు.. మనకి.. పట్టుదల వదల రాదని పాఠాలు చెప్తుంటే.. మనం వదిలేస్తామా? ఆ వడతి ప్రేమ సంపా దించవి ప్రాణాలు ఎందుకని.. ఒక నిర్ణయానికొచ్చాం. ఎలా సంపా దించాలో ఓ ప్రణాళిక కూడా సిద్ధ పరుచుకున్నాం.

ఆ రోజుల్లోనే అమావాస్యగాడని. ఒక స్టూడెంట్ ఉండేవాడు. మాలావు. మా పొడుగు, బొగ్గు నలుపా, వాడు నలుపా అంటే.. వాడే.. వాడే.. వాడే అని ముమ్మారు చెప్పాల్సిందే-

అలాంటి అమావాస్యగాడ్ని మనం పట్టుకుని దువ్వేసాం. వాడు మొదట్లో తల అడ్డదిడ్డంగా ఆడించేడు. అయితే.. వందరూపాయల నోటు చూపించి పని పూర్తిచేస్తే.. ఈ వందా.. నీదే అనగానే మెత్తబడ్డాడు.

"నువ్వు నీ డొక్కు సైకిల్‌తో... తిన్నగా వెళ్లి పేపర్ షాట్‌కి డాష్ ఇస్తావ్! ఇద్దరూ.. క్రిందపడిపోతారు. నీ పెర్సనాల్టీ చూసి ఆమె చెయ్యి ఎత్తడానికి జంకుతుంది. అప్పుడు నే రంగంలోకి దిగి.. నిన్ను నాలుగు పీకులు పీకుతాను. సినిమా సీనే - అయితేనేం నువ్వు కాలేజీలో బుద్ధిమంతు డివి కన్నా - ఫస్టు రేంక్ స్టూడెంటువి కన్నా... ఇది డ్రామా అని ఆ పిల్ల అనుకోలేదు.. నీలాంటి శాంసన్‌ని చెవులట్టుకుని ఆడించేను కన్నా అమ్మాణి నాతో ప్రేమలో పడాల్సిందే"

ప్లాను, ఆపరేషన్ అమావాస్యగాడి మొద్దుబుర్రకి అర్థ మయ్యేలా చెప్పి.. వాడ్ని నేను ఎక్కడెక్కడ కొడతానో వాడెలా.. నన్ను కొట్టినట్టు నాటకమాడాలో రిహార్సల్ చేయించి మనం రంగంలోకి దిగేం.

ఆ రోజు సూర్యుడు కాలేజీ కుర్రాడిలా ఆలస్యంగా నిద్రలేచాడు. ఉదయం చల్లగాలులు - పిల్లగాలుల్లా వీస్తున్నాయ్. మన ప్రిన్సిపాల్ ఏడాదిగా వేస్తున్న నల్లకోటు వదిలేసి తెల్లకోటు వేశాడు. ప్రకృతి అంతా ప్రేమకావ్యం గానం చేస్తున్నట్టుంది.

మనం కూడా.. సీనరీకి తగ్గట్టు లెదర్ జర్కిన్.. మూడు అయిదుల సిగరెట్‌పాకెట్.. అంబాసిడర్ బూటుతో.. దేవానంద్ క్రాపు సరిచేసుకుంటూ కాలేజీలో అడుగుపెట్టాం.

కాలేజీ గ్రౌండ్‌కి వెయ్యి సూర్యుళ్ల కాంతిని మోసి తెస్తూ పేపర్‌షాట్ మెల్లిమెల్లిగా నడిచి వస్తోంది. ఆ రోజు ఆమె ఆకుపచ్చ పట్టు పరికిణీ.. బ్లౌజు వేసింది. ఆ పచ్చదనం.. పచ్చికలో కల్సిపోతోంది. గుండెల మీదున్న వోణీ మాత్రం ప్రస్ఫుటంగా కనబడుతోంది. సూర్యుడు మబ్బుల చాటునించి ఆమె అందాన్ని చూస్తున్నాడు కాబోలు. రెండే రెండు కిరణాలు ఆ తెల్లవోణీ మీద పడి పరావర్తనం చెందు తున్నాయ్.

ఆ వింత వెలుగులో ఆమె నడిచి వస్తుంటే ఆ పచ్చికమీద ప్రాణం పోసుకున్న తెల్లగులాబీ నడిచి వస్తున్నట్టుంది.



ఆమె అందాన్ని... ఆమె రాజసాన్ని చూస్తూ చేష్టలు దక్కి నిలబడిపోయాను. ఇంతలో అమావాస్యగాడు ఎలా వచ్చాడో... ఆమెను గుద్దేశాడు. ఆమె అల్లంత దూరాన పడింది. అమావాస్యగాడు ఆమడదూరాన్న పడ్డాడు. వాడెంత బాగా నటించేడంటే అదేదో నేను ఏర్పాటు చేసిన డ్రామాలాగా లేదు.

అయితే తెల్లగులాబీ... క్రింద పడగానే ఎర్ర గులాబీ అయిపోయింది. ఒక్క ఉదుటున చెయ్యి ఎత్తి... అమావాస్యగాడ్ని కొట్టబోయింది. వాడు ఆమె చెయ్యి పట్టుకుని ఏదో అంటున్నాడు. వాడేమన్నాడో నే వినలేదు కాని... కింగ్‌కాంగ్‌నైనా కొట్టడానికి సిద్ధ పడుతున్న ఆమె ఖలేజాకు నాకు కాళ్లు వణికేయ్.

ఇక మనం... రంగప్రవేశం చెయ్యాల్సిన వేళయిందని గ్రహించి... నేను ముందుకడుగేశాను. ఆమె చేతిలో ఇరుక్కున్న అమావాస్యగాడ్ని అవలీల గా... నించోపెట్టి నాలుగు పీకులు పీకేను. వాడ్ని నాలుగు పీకి పక్కకు తిరిగేసరికి ఆమె వెళ్లిపోయింది. ఫైటింగ్ స్పిరిట్‌లో నే గమనించలేదు. అమావాస్య గాడు మాత్రం... ఆమె... నేను కొట్టడం చూసే వెళ్లిందని... నొక్కి చెప్పాడు. ఆవేశంలో ఆరుదెబ్బలు ఎక్కువ కొట్టినని మరో అరవై ఎక్కువ లాక్కుని పోయాడు.

ఆరోజు సాయంత్రానికి కాలేజీలోఅందరికి ఈ విషయం తెల్సిపోయింది. అంతా నన్ను అభినందించేవాళ్లే. మనం ఆరోజు మబ్బుల్లో తేలి పోయాం. గోకుల్ బార్‌లో మూడువేలు ఎగిరిపోయాయ్.

అయితేనేం... ఆ రోజుతో మన జీవితం మారి పోయింది. ఆమె అప్పుడప్పుడు నాకేసి క్రీగంట చూడటం ఆరంభించింది. దాంతో మనకి ధైర్యం వచ్చేసింది. ప్రేమలేఖలు గుప్పించటం మొదలెట్టాం.

ఆ ప్రేమలేఖలు అందించటానికి అమావాస్యగాడికి ఉత్తరానికి యాభై చొప్పున ఇవ్వాల్సివచ్చింది. ఉత్తరం అందినరోజూ... ఆమెనించి ఒక చిరు నవ్వు అందటం మొదలెట్టింది. ఏడాది పాటు ఉత్తరాలు మీద ఉత్తరాలు పంపు తూనే ఉండేవాడ్ని.

ఓ సాయంత్రం.. బోటనీ క్లాసు ఎగ్గొట్టి మన ఫ్రెండ్స్‌తో మనం.. మర్రిచెట్టు క్రింద నిలబడ్డాం. ఆమె తిన్నగా నడుచు కుంటూ మా ముందుకొచ్చింది.

"కామరాజుగారూ!" కోకిలలా పిల్చింది.

'యస్.. పేపర్ షాట్.. సారీ. మీ.. పేరు"

"ఫరవాలేదు. అలాగే పిలవండి".

"థాంక్సు" కోటిమిలియన్ల అమెరికన్ నవ్వు నవ్వేను.

"మీతో మాట్లాడాలి అందామె" దాంతో నా ఫ్రెండ్స్ మాయం అయిపో యారు. వీళ్లు గోకుల్ బార్‌లో ప్రత్యక్షం అయి ఈ శుభముహూర్తంలో ఎంత తాగేస్తారో అనుకుంటూ.. ఆమెకేసి చూసి చిరునవ్వు నవ్వేను. జయించిన సంతోషంతో అందంగా నవ్వేను. ఆమె ముందుకు అడుగువేసింది. నేను అనుసరించేను.

"మీరంటే..నాకెంతో ఇష్టం.." అందామె.

"అవును.. లేకుంటే.. నా ప్రేమ లేఖలు బజ్జీలకొట్లో కనపడేవిగా.." అన్నాను.

"ఈవాళ ఉదయంతో కలిపి... మీరు అమావాస్య ద్వారా నాకు పంపిన ప్రేమలేఖలు మూడువందల ముప్పయి ఒకటి..."

"అవును... కరెక్టు... ఏడాదిగా రాస్తుంటే ఈనాటికి కరుణించేవ్. అదే చాలు"

"ఉత్తరానికి యాభై చొప్పున అమావాస్యకు చాలా డబ్బు ఇచ్చారనుకుంటా" ఆమె కిసుక్కున నవ్వింది.

"అదొక లెక్కా... నీ కోసం ఎంతయినా ఖర్చుపెట్ట గలను. కోటిరూపాయలు - ఏడాదికి మా డాడీ ఇన్‌కమ్ టాక్సు కడతాడు."

"విన్నాను. అందుకే ఊరుకున్నాను... ఇదిగో ఈ కట్టలో మూడువందల ముప్పయి ఒక్కటి ఉత్తరాలూ ఉన్నాయ్... చింపి చదవనందుకు మరోలా భావించవద్దు."

"అంటే నా ఉత్తరాలు నువ్వు చదవలేదా?"

"లేదు తిప్పి మీ ముఖంమీద కొడితే అమావాస్యకి మీరిచ్చే డబ్బు ఆగిపోతుందని ఊరుకున్నాను. తల్లి దండ్రి లేని అనాధ - వారాలు చేసుకుంటూ చదు వుకునే బుద్ధిమంతుడు. అతని చదువు ఆగిపో తుందని నేను అల్లరి పెట్టలేదు..."

నే కొయ్యబారిపోయి నిలబడిపోయాను.

"విలాసాలకు ఎంతో తగలేసే మీకు ఆ సొమ్ము ఎక్కువ కాదు. మీ దయవల్ల... అమావాస్య చదువు కున్నాడు. అతను మీ మేలు మర్చిపోలేడు. అతనే కాదు నేనూ మర్చిపోలేను. ఎందుకంటే... అమా వాస్యని నేను పెళ్లి చేసుకోబోతున్నాను. మంచి మనసుతో మీరు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను."

సూర్యుడు... భూమి... ఆకాశం... మూడూ గిర్రున తిరిగేయ్ కంటిముందు... మనం ఆ షాక్‌లోంచి తేరుకునే లోపల... అమ్మాణి వెళ్లిపోయింది.

మనం పెళ్లికి వెళ్లి ప్రజంట్ చదివించి వచ్చేం. ఇప్పుడా అమావాస్యగాడు మధ్యప్రదేశ్‌లో కలక్టర్‌గా ఉంటున్నాడని ఎవరో చెపితే విన్నాను. □